సుంకిశాల వద్ద కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

నీటిమట్టం తగ్గిపోయి బయటకు కనిపిస్తున్న సొరంగం

అడుగంటిన సాగరం.. తేలిన సుంకిశాల సొరంగం

స్వామికార్యం.. స్వకార్యం.. రేవంత్ సర్కార్ మొద్దునిద్ర

నీళ్లొదిలింది ఎవరికోసం?

- మేఘాకు కలిసొచ్చిన ఆంధ్రప్రదేశ్ జలచౌర్యం
- రెండున్నర నెలల్లోనే నాగార్జున సాగర్‌లో 130 టీఎంసీలు ఖాళీ
- 540 అడుగులకు తగ్గాక హైడ్రామా
- సొరంగం తేలడంతో పునరుద్ధరణ పనులు మొదలు
- నీటిమట్టం తగ్గకుంటే 'మేఘా'పై భారీగా పునరుద్ధరణ వ్యయం

(గుండాల కృష్ణ)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ పూర్తిగా నిండిన ప్రతి ఏడాది తెలంగాణలోని ఎడమ కాల్వ కింద వానకాలంతో పాటు యాసంగి పంటలకు పుష్కలమైన సాగునీరు అందుతుంది. హైదరాబాద్, ఇతర జిల్లాల తాగునీటికీ ఎలాంటి ఢోకా ఉండేది కాదు. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సాగర్ జలాశయం ఎండిపోయే దుస్థితి ఎందుకు వచ్చింది? ఎడమ కాల్వతో పాటు ఏఎమ్మార్ ప్రాజెక్టు కింద సుమారు 9 లక్షల ఎకరాల్లోని యాసంగి పంటలకు డిసెంబరు 15, 2024 నుంచి ఫిబ్రవరి-23, 2025 వరకు సాగునీరు అందిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో సహా అధికారికంగా పత్రికల్లో షెడ్యూలు విడుదల చేసింది. అంటే లక్షలాది మంది రైతులకు సాగునీటి భరోసాను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఇచ్చింది. మరిప్పుడు నాగార్జునసాగర్ నుంచి చివరి భూములదాకా యాసంగికి నీళ్లిచ్చే పరిస్థితి ఉన్నదా? సాగర్‌లో ఆ మేర నీటి నిల్వ ఉన్నదా? రైతులకు భరోసా ఇచ్చిన ప్రభుత్వం సాగర్ ఖాళీ అవుతుంటే మూణ్నెళుగా ఎందుకు మొద్దునిద్ర పోయింది? శ్రీశైలం, సాగర్ నుంచి ఏక్షణం ఎన్ని క్యూసెక్కులు తరలిపోతున్నాయనే వివరాలు ఇప్పుడు సామాన్యుడు సైతం ఆన్‌లైన్‌లో తెలుసుకునే సాంకేతిక వెసులుబాటు ఉన్నది. అలాంటిది ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం తెలంగాణ కోటా నీటిని సైతం సాగర్ నుంచి మళ్లించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తెలవకుండా ఉండదు. అయినా సాగర్ 540 అడుగుల కంటే తక్కువ నీటిమట్టానికి పడిపోయి, సర్కారు నిర్లక్ష్యాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశించిన తర్వాత గానీ ప్రభుత్వం హైడ్రామాను మొదలుపెట్టలేదు. 'ఏపీ జలదోపిడీని అడ్డుకోండి' అని సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖను ఆదేశించడం.. అదేరోజు జలమండలి, మేఘా ఇన్‌ఫ్రా అధికారులు సుంకిశాలను సందర్శించి పునరుద్ధరణ పనులు మొదలుపెట్టడం వెనువెంటనే జరిగిపోయాయి. నిరుడు జూలై 18 నుంచి ఇప్పటి వరకు అంటే 219 రోజులుగా క్షణం కూడా ఆగకుండా సాగర్ కుడి కాల్వలో కృష్ణమ్మ పరుగుల వెనుక ఏం జరుగుతున్నది? తెలంగాణ రైతాంగానికి హక్కుగా దక్కాల్సిన కృష్ణాజలాలకు గండి కొట్టిన ఏపీ సర్కారు జలచౌర్యంతో కోట్లాది రూపాయల పునరుద్ధరణ భారాన్ని తప్పించుకొని ఒడ్డున పడింది ఎవరు? స్వామికార్యం.. స్వకార్యం.. నెరవేర్చుకునేందుకు తెలంగాణ రైతులను పణంగా పెట్టింది ఎవరు? ఇన్నాళ్లూ కండ్లు మూసుకొని ఇప్పుడు ఆ నెపాన్ని పాతాళ గంగమ్మపైకి నెట్టి.. భూగర్భజలాలు పడిపోయినందున రైతులు పంటలు వేసుకోకండి, పెట్టుబడి పెట్టకండి అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం వెనక ఆంతర్యమేమేటి? అనేది తేలాల్సి ఉన్నది.

సుంకిశాల పంప్‌హౌస్‌లోకి వెళ్లే సొరంగాన్ని మూసివేసిన దృశ్యం

సాగర్ ఖాళీ కావడమే సుంకిశాలకు వరమా?

వాస్తవానికి నిరుడు కృష్ణా బేసిన్‌లో వచ్చిన భారీ వరదతో సుంకిశాల పునరుద్ధరణ పనులు ఏప్రిల్-మే నెలలోగానీ మొదలయ్యే అవకాశాలులేవని సాగునీటి రంగ నిపుణులు, అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో సాగర్‌లో నీటిమట్టం ఎక్కువ ఉన్న సమయంలోనూ పంప్‌హౌస్‌లోకి నీళ్లు రాకుండా సొరంగాన్ని మూసివేసే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కోసం మేఘా ఇన్‌ఫ్రా ప్రయత్నాలు చేసింది. నిపుణులను రప్పించి, సాంకేతిక సంప్రదింపులు చేసింది. అయితే నీటిమట్టం ఎక్కువ ఉన్న సమయంలో సొరంగాన్ని మూసివేయాలంటే అందుకు భారీగా ఖర్చవుతుందని తెలిసింది. అందుకే నీటిమట్టం తగ్గే వరకు వేచి చూసి ఇప్పుడు 540 అడుగుల కంటే తక్కువ నీటిమట్టం రాగానే పునరుద్ధరణ పనులు మొదలుపెట్టారు. హైదరాబాద్ మహానగర తాగునీటి కోసం సుంకిశాల పనుల పునరుద్ధరణ అనివార్యమే. కాకపోతే ప్రభుత్వం దీనిపై ముందస్తు ప్రణాళిక ప్రకటించి ఉంటే 9 లక్షల ఎకరాల ఆయకట్టులోని పంటల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారేదికాదనేది అక్షర సత్యం.

మొదలైన సుంకిశాల పునరుద్ధరణ పనులు

సాగర్‌లో నీటిమట్టం తగ్గడం ద్వారా సుంకిశాల పంప్‌హౌస్‌లో మధ్య సొరంగం తేలడంతో పనుల పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. 540 అడుగులకంటే తక్కువ నీటిమట్టం పడిపోయిన రోజే జల మండలి, మేఘా ఇన్‌ఫ్రా అధికారులు సుంకిశాలను సందర్శించారు. ఘటన జరిగిన క్షణం నుంచి సాగర్‌లో 540 అడుగుల నీటిమట్టం వరకు సుంకిశాల పంప్‌హౌస్‌లోని మధ్య సొరంగం ద్వారా కృష్ణాజలాల ప్రవాహం ఉండేది. నీటిమట్టం తగ్గిన వెంటనే ప్రవాహం నిలిచిపోయి, పంప్‌హౌస్‌లో కూడా నీటిమట్టం తగ్గిపోయి ఎగువ సొరంగం తేలిపోయింది. (బయటకు కనిపిస్తుంది) దీంతో సాగర్ జలాశయం ఫోర్‌షోర్‌లో సుంకిశాల సొరంగాన్ని భారీ ఎత్తున మట్టి, రాళ్లు పోసి మూసివేశారు. ఇక పంప్‌హౌస్‌లో ఉన్న నీటిని తోడి పోయాల్సి (డీవాటరింగ్) ఉంది. అందులో ఇప్పటికీ కొన్ని యంత్రాలు, భారీ క్రేన్, కాంక్రీట్ శిథిలాలు ఉన్నాయి. వాటిని తొలగించిన తర్వాత కాంక్రీట్ పనులు మొదలుపెట్టేందుకు అవకాశమున్నదని అధికారి ఒకరు తెలిపారు.

గతంలో ఎన్నడూలేని విధంగా సాగర్ ఖాళీ

లక్షలాది ఎకరాల ఆయకట్టుకు జీవం పోయడంతో పాటు కోట్లాది మంది గొంతు తడిపే సాగర్‌కు నిరుడు భారీ వరదలొచ్చాయి. ఏకంగా 850 టీఎంసీల కృష్ణాజలాలు సముద్రంలో కలిశాయి. కానీ ఎండకాలం మొదలు కాకముందే వట్టిపోయే పరిస్థితి వచ్చింది. నిరుడు డిసెంబర్ 1వ తేదీన నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్ నుంచి గురువారం నాటి వరకు ఏకంగా 126.81 టీఎంసీలు తోడారు. అంటే రోజుకు 1.546 టీఎంసీలు రెండు రాష్ట్రాలు తీసుకున్నాయి. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల వినియోగం దేశ్ జల వనరుల శాఖ రెండు ఇండెంట్స్ ద్వారా కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. కుడి కాల్వ కింద నీటి విడుదల కొనసాగిస్తూనే ఉన్నది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో 4 మోటర్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. వీటి డిజైన్ డిశ్చార్జి 600 క్యూసెక్కులు అంటే 2400 క్యూసెక్కులు విడుదల కావాలి. కానీ సాగర్‌లో 540 అడుగుల కంటే నీటిమట్టం పడిపోగానే డిశ్చార్జి 500 క్యూసెక్కులకు పడిపోయి ఇప్పుడు 2 వేల క్యూసెక్కులే వస్తున్నది. ఎండకాలం మొదలు కాకముందే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉంటుందనేది ఊహించవచ్చు. పుణ్యకాలం కాస్తా దాటిపోయిన తర్వాత 'జలచౌర్యాన్ని అడ్డుకోండి' అని సీఎం ఆదేశించడం, మా రైతులు ఇబ్బందులు పడకుండా సహకరించండి అంటూ కృష్ణా బోర్డు చైర్మన్‌ను మంత్రి ఉత్తమ్ కోరడం వల్ల కుడికాల్వ పారుదల ఆగుతుందా? 9 లక్షల ఎకరాల్లో పంటలు వేసుకున్న తెలంగాణ రైతులు గట్టెక్కుతారా?

- 2010-11 నీటి సంవత్సరంలో 2010, డిసెంబర్ 1వ తేదీన సాగర్ నిండుకుండలా ఉన్నది. 2011, ఫిబ్రవరి 1వ తేదీన నీటిమట్టం 570.20 అడుగులు, మార్చి 1వ తేదీన 557.60 అడుగులు, ఏప్రిల్ 1వ తేదీన 558.80 అడుగులు, మే 1న 553.1 అడుగుల నీటిమట్టం ఉన్నది.
- 2014-15 నీటి సంవత్సరంలో పెద్దగా వరదలు లేని సమయంలోని లెక్కలను పరిశీలిస్తే 2014, డిసెంబర్ 1వ తేదీన సాగర్‌లో నీటిమట్టం 564.30 అడుగులుగానే ఉన్నది. అయినా 2015 ఫిబ్రవరి 1వ తేదీన 536.50 అడుగులు, మార్చి 1న 526.10 అడుగులు, ఏప్రిల్ 1న 519.60 అడుగులు, మే 1న 513.90 అడుగుల నీటిమట్టం ఉన్నది.
- 2020-21 నీటి సంవత్సరాన్ని పరిశీలిస్తే 2020, డిసెంబర్ 1న పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉన్న సాగర్‌లో 2021, ఫిబ్రవరి 1న 561.80 అడుగులు, మార్చి 1న 551.30 అడుగులు, ఏప్రిల్ 1న 546.80 అడుగులు, మే 1న 538.10 అడుగులు, జూన్ 1న 533.10 అడుగుల నీటిమట్టం ఉన్నది. నాగార్జునసాగర్‌లో ఇప్పుడు (20వ తేదీ) ఉన్న 535.60 అడుగుల నీటిమట్టం 2021 మే, 17న ఉన్నది.
- 2021-22 నీటి సంవత్సరంలో కూడా 2021, డిసెంబర్ 1న సాగర్ పూర్తిగా నిండి ఉన్నది. 2022, ఫిబ్రవరి 1న 579 అడుగులకు చేరుకున్న నీటిమట్టం మార్చి 1న 571.70 అడుగులు, ఏప్రిల్ 1న 548.70 అడుగులు, మే 1న 538.80 అడుగుల నీటిమట్టం ఉన్నది.
- 2022-23 నీటి సంవత్సరంలోనూ మార్చి 19న 535.60 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం నీటి సంవత్సరం పూర్తయ్యేనాటికి మే, 31న కూడా 520 అడుగులకు తగ్గలేదు.

పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ వినియోగం ఏకంగా 78 శాతం వరకు ఉంటే తెలంగాణ వినియోగం 22 శాతం దాటడం లేదు. ఏకపక్షంగా ఏపీ తోడుకుపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోవడం ఒకవంతైతే, 9 లక్షల ఎకరాలకు ఏప్రిల్ 25 వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా నీటి విడుదలను ఎందుకు నియంత్రించలేదనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలోనూ భారీ వరదలు వచ్చిన సంవత్సరాలను పరిశీలిస్తే ప్రస్తుతానికి గతానికి చాలా భిన్నంగా నీటి విడుదల ఉండటం అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నది.

సాగుకు కష్టమే.. తాగుకు గండమే..

సాగర్‌లో కనీసంగా 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా కొనసాగుతుంది. అంటే ఇక నాగార్జునసాగర్‌లో 510 అడుగుల వరకు వాడుకునేందుకు ఉన్న నీటి లభ్యత దాదాపు 48 టీఎంసీలు. 9 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్, మిషన్ భగీరథ తాగునీటి కోసం 116 టీఎంసీలు కావాలని ఈ నెల 6న తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ కృష్ణా బోర్డుకు ఇండెంట్ పెట్టారు. ఇక ఎడమ కాల్వ కింద ఆయకట్టుకు 33.86 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ వినియోగం ఏకంగా 78 శాతం వరకు ఉంటే తెలంగాణ వినియోగం 22 శాతం దాటడం లేదు. ఏకపక్షంగా ఏపీ తోడుకుపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోవడం ఒకవంతైతే, 9 లక్షల ఎకరాలకు ఏప్రిల్ 25 వరకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా నీటి విడుదలను ఎందుకు నియంత్రించలేదనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలోనూ భారీ వరదలు వచ్చిన సంవత్సరాలను పరిశీలిస్తే ప్రస్తుతానికి గతానికి చాలా భిన్నంగా నీటి విడుదల ఉండటం అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నది.

కిందికి పోయేకొద్దీ ఇంకా దయనీయం

నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ ఎఫ్ఆర్ఎల్ 590 అడుగులు. ఎండీడీఎల్ 510 అడుగులు. (అత్యవసరమైతే తప్ప అంతకు కిందికి నీటిని విడుదల చేయరాదని హైకోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ జీవోలు ఉన్నాయి) ఎడమ కాల్వ గేట్లు స్పిల్‌వే కంటే 25 అడుగుల ఎత్తు ఉన్న దరిమిలా సాగర్‌లో 514 అడుగులకంటే ఎక్కువ నీటిమట్టం ఉంటేనే పూర్తిస్థాయి నీటి విడుదల ఉంటుంది. కానీ కుడి కాల్వ గేట్ల ఎత్తు 15 అడుగులు ఉన్నందున సాగర్‌లో 504 అడుగుల నీటిమట్టం ఉన్నా పూర్తిస్థాయిలో (డిజైన్ డిశ్చార్జి) ఉంటుంది. పైగా గేట్లు, కాల్వల వెడల్పు కూడా చాలా ఎక్కువ. ఉదాహరణకు సాగర్ రిజర్వాయర్‌లో 510 అడుగుల మేర నీటిమట్టం ఉన్నపుడు ఎడమ కాల్వ గేట్లు అన్నీ పూర్తిగా ఎత్తినా 6,018 క్యూసెక్కుల నీళ్లు వస్తాయి. అదే కుడి కాల్వ నుంచి 24,840 క్యూసెక్కుల నీళ్లు వెళ్తాయి. 504 అడుగుల నీటిమట్టం ఉన్నపుడు గేట్లు పూర్తిగా తెరిస్తే ఎడమ కాల్వ నుంచి కేవలం 3,625 క్యూసెక్కులు వెళ్తే, కుడి కాల్వ ద్వారా 11,420 క్యూసెక్కుల నీళ్లు వెళ్తాయి. అంటే సాగర్‌లో నీటిమట్టం పడిపోయే కొద్దీ తెలంగాణ అవకాశాలు సన్నగిల్లుతాయి.

బేసిన్ అవసరాలకే తొలి ప్రాధాన్యమివ్వాలి

- ఆ తర్వాత మిగులు జలాలుంటేనే ఇతర ప్రాంతాలకు ఇవ్వాలి
- కావేరి ట్రిబ్యునల్ అవార్డును పరిగణనలోకి తీసుకోవాలి
- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ స్పష్టీకరణ
- తదుపరి విచారణ మార్చి 24కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి21 (నమస్తే తెలంగాణ): నదీజలాల వినియోగంలో తొలుత బేసిన్ అవసరాలకే ప్రాధాన్యమివ్వాలని, ఆ తర్వాత మిగులు జలాలు ఉంటేనే బేసిన్ అవతలి ప్రాంతాలకు అవకాశమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన సెక్షన్ 3 మార్గదర్శకాల ప్రకారం తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయడంపై ట్రిబ్యునల్ జరుపుతున్న విచారణ శుక్రవారం కూడా కొనసాగింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదన వినిపించారు. కావేరి ట్రిబ్యునల్ అవార్డుతో పాటు తమిళనాడు, కర్ణాటక కేసులపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ పలు అంశాలను ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్రకు నివేదించారు. నదీ పరివాహక ప్రాంతంలో లభ్యమయ్యే నీటిని తొలుత ఇన్-బేసిన్ అవసరాలను తీర్చేందుకు ఉపయోగించాలని, ఆ తర్వాత మిగులు నీరుంటేనే ఇతర అవసరాలకు మళ్లించాలని కావేరి ట్రిబ్యునల్ స్పష్టం చేసిందని గుర్తుచేశారు. అదే ప్రతిపాదనను కృష్ణా బేసిన్‌లోనూ అమలు చేయాలని పేర్కొన్నారు. కావేరి ట్రిబ్యునల్ సూచించినట్టుగా, సుప్రీంకోర్టు సమర్థించినట్టుగా దీర్ఘకాలిక పంటలను స్వల్పకాలానికి తగ్గించాలని, ఏపీ ఇప్పటికే ఉన్న అవసరాలకు నీటిని డిమాండ్ చేస్తున్నదని, తెలంగాణ కొత్త ప్రాంతాలకు నీటిని కేటాయించాలని కోరుతున్నదని వివరించారు. నీటి సమాన పంపిణీ సూత్రాన్ని అవలంబించడం ద్వారా అసమతుల్యతలను తగ్గించాలని, బేసిన్ పారామితుల ఆధారంగా 811 టీఎంసీల్లో 71% తెలంగాణకు కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఏపీలో పెన్నా, గుండ్లకమ్మ తదితర బేసిన్లకు అదనపు నీటి వనరులు సమకూరాయని, అంతేకాకుండా పోలవరం నుంచి నాగార్జునసాగర్ కుడి కాలువకు, ఆ తర్వాత 150 టీఎంసీల సామర్థ్యంతో బొల్లేపల్లి రిజర్వాయర్‌కు, ఆపై బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు 200 టీఎంసీల గోదావరి జలాలను మళ్లించేందుకు ఏపీ ప్రణాళికలను రూపొందించిందని ట్రిబ్యునల్‌కు వివరించారు. పెన్నా బేసిన్‌లో 228 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యాన్ని సృష్టించిందని, ఇతర బేసిన్‌లను కలుపుకుని మొత్తంగా 360 టీఎంసీల నిల్వసామర్థ్యం ఏపీకి ఉన్నదని ట్రిబ్యునల్‌కు నివేదించారు. ఏపీ ఇప్పటికీ బేసిన్ వెలుపలున్న ప్రాంతాలకు మాత్రమే అదనపు జలాలను కోరుతున్నదే తప్ప బేసిన్ పరిధిలోని ప్రాంతాలకు కాదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కనీసం ఒక్క పంటకు కూడా నీరు అందని కొత్త ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, చెరకు లాంటి పంటల సాగు కోసం కాకుండా ఎండిపోయిన పంటలకు తెలంగాణ నీటిని కోరుతున్నదని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు.

విచారణ మార్చి24వ తేదీకి వాయిదా

తెలంగాణ తరపున గత మూడు రోజుల నుంచి కొనసాగించిన వాదనలను వైద్యనాథన్ శుక్రవారంతో ముగించారు. దీంతో తదుపరి విచారణను మార్చి 24 నుంచి 26 వరకు చేపట్టనున్నట్టు ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ప్రకటించారు. తాజా విచారణకు తెలంగాణ తరపున వైద్యనాథన్ తోపాటు ఇతర న్యాయవాదులు, ఈ-ఇన్-సీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఇంజినీర్లు సల్లా విజయ్‌కుమార్, రవిశంకర్, వెంకటనారాయణ, ఏపీ తరపున సీనియర్ న్యాయవాది జయదీప్‌గుప్తా, ఇతర న్యాయవాదులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

మీడియాతో మాట్లాడున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గాదరి కిశోర్, భిక్షమయ్యగౌడ్, భగత్, బొల్లం మల్లయ్య తదితరులు

తెలంగాణను ఎండబెట్టి ఏపీకి నీళ్లిస్తరా?

- బీజేపీ, కాంగ్రెస్, బాబు, రేవంత్ వల్లే రాష్ట్రానికి కృష్ణా జలాల్లో దక్కని వాటా
- హరీశ్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా సర్కారు సొల్లు పురాణం
- రేవంత్ తిట్లతోనే సీఎం అయ్యిండు
- ఉత్తమ్ అలాగే అనుకుంటున్నడేమో
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణను ఎండబెట్టి ఏపీకి నీళ్లిస్తరా? మన రాష్ట్ర వాటాగా దాచిపెట్టుకున్న కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చోద్యం చూస్తున్నది?' అంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీ నీటి చౌర్యాన్ని తక్షణమే అడ్డుకోకుంటే తెలంగాణలో సాగు, తాగునీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోయిలేకుండా సొల్లు పురాణం చెప్పారని మండిపడ్డారు. రాష్ట్రానికి పొంచి ఉన్న నీటి ఎద్దడి ప్రమాదం గురించి మాట్లాడితే కాంగ్రెస్ నేతలు రాజకీయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, భిక్షమయ్యగౌడ్, బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్, పార్టీ నేతలు నర్సింహారెడ్డి, వెంకట్, నవీన్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు సరైన నీటి వాటా దక్కకపోవడానికి కాంగ్రెస్, బీజేపీ, చంద్రబాబు, రేవంత్‌రెడ్డే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి తిట్లతో సీఎం అయ్యారని, తాను కూడా అదే భాష మాట్లాడితే సీఎం అవుతానని ఉత్తమ్ అనుకుంటున్నారేమోనని ఎద్దేవాచేశారు. ఏపీ నీటి చౌర్యంపై హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడిన చెత్తనే ఉత్తమ్ కేసీఆర్ మీద మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'ఉత్తమ్ మాట్లాడాల్సింది నీటి చౌర్యం జరుగుతున్నా పట్టించుకోని కేంద్రం మీద, అక్రమంగా నీటిని తరలిస్తున్న పక్క రాష్ట్రం చంద్రబాబు మీద' అని హితవుపలికారు.

కాంగ్రెస్‌ది ద్రోహ చరిత్ర

ఏపీలో ప్రాజెక్టుల మీద జగన్, చంద్రబాబు ఒకే వైఖరి మీద ఉన్నారని, తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పోతిరెడ్డి పాడు ప్రాజెక్టును వ్యతిరేకించి ఆనాడు తమ పార్టీ నేతలు వైఎస్ క్యాబినెట్ నుంచి బయటకొచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ తెలంగాణకు చేసిన ద్రోహ చరిత్ర చాలా ఉన్నదని విమర్శించారు. కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోసం ప్రయత్నిస్తున్నామని ఉత్తమ్ చెప్తున్నారని, ముందు వేసిన పంటలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. మోదీకి, చంద్రబాబుకు ఉత్తమ్ భయపడుతున్నారని విమర్శించారు. 'అవి నీతి గురించి కాంగ్రెస్ మాట్లాడుకుంటే అవినీతి అనే పదమే సిగ్గుపడుతుంది. ప్రతి దాంట్లో కమీషన్ అడుగుతున్న కాంగ్రెస్ నేతలా.. కేసీఆర్ గురించి మాట్లాడేది?' అని ఫైరయ్యారు. మంత్రుల అవినీతి చిట్టా తమ వద్ద ఉన్నదని, ప్రజలు కూడా దీనిపై చర్చించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటలను కాపాడుకోవడానికి, కృష్ణా జలాల వాటా కోసం బీఆర్ఎస్ ఎంతదూరమైనా వెళ్తుందని స్పష్టంచేశారు.

సోయిలేకుండా సొల్లు పురాణం

కాంగ్రెస్ మంత్రులు కృష్ణా జలాలపై సోయి లేకుండా, అవగాహన లేకుండా సొల్లు పురాణం చెప్తున్నారని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఇసుక దోపిడీ కోసం కాళేశ్వరాన్ని ఎండబెట్టారు కాబట్టే గతంలో మాదిరిగా వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు నీళ్లు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చర్చకు వస్తావా ఉత్తమ్? శ్రీరాంసాగర్ నీళ్లు ఎందుకు రావడం లేదో చర్చిద్దాం' అని సవాల్ విసిరారు. కేసీఆర్‌ను తిట్టడం బంద్ చేసి కృష్ణా జలాల వాటాను సాధించుకోవడం మీద మంత్రులు దృష్టిపెట్టాలని సూచించారు.

వీళ్లకు నీళ్లను ఎట్ల కొలుస్తరో తెలుసా?

'సర్పంచ్‌కు కూడా సమాధానం చెప్పలేని స్థాయి కాంగ్రెస్ నేతలది, వీళ్లా కేసీఆర్ గురించి మాట్లాడేది?' అని జగదీశ్‌రెడ్డి నిప్పులు చెరిగారు. 'అసలు నీళ్లను ఎట్లా కొలుస్తారో కాంగ్రెస్ నేతలకు తెలుసా? టీఎంసీ అంటే తెలుసా?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్‌ను విమర్శించేందుకు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు సిగ్గుండాలె.. కేంద్రమంత్రులుగా ఉన్న వీరు కేఆర్ఎంబీ అధికారులతో మాట్లాడి తెలంగాణకు రావాల్సిన నీటివాటాను సాధించడం చేతకాదా?' అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పాలమూరు నుంచి వలసలు ఆగాయా లేదా? నల్లగొండ నుంచి ఫ్లోరైడ్ భూతం పోయిందా లేదా? అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

లోకం పోకడ



కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు శుక్రవారం నిర్వహించాల్సిన అత్యవసర సమావేశాన్ని ఈ నెల 24కు వాయిదా వేసింది. అనివార్య కారణాలతో హాజరుకాలేకపోతున్నామని, సమావేశాన్ని మరో రోజుకు వాయిదా వేయాలని బోర్డుకు ఏపీ సర్కారు లేఖ రాయడంతో సమావేశాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు బోర్డు చైర్మన్ అతుల్ జైన్ సమాచారం అందించారు. ఈ ఏడాది ఏపీ ప్రభుత్వం వాటాకు మించి కృష్ణా జలాలను మళ్లించుకుపోయింది. ఇదే అంశంపై రాజకీయ దుమారం నడుస్తున్నది. ఈ నేపథ్యంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు నిర్ణయించినా ఏపీ సర్కారు సమావేశాన్ని వాయిదా వేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

ఆర్‌అండ్‌ఆర్‌కు నిధులిస్తేనే పనులు

ప్రభుత్వానికి స్పష్టంచేసిన ఇరిగేషన్ ఇంజినీర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): నిర్వాసితుల సహాయ, పునరావాసానికి నిధులను పూర్తిస్థాయిలో చెల్లిస్తేనే ప్రాజెక్టుల పనులు ముందుకు సాగుతాయని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. ప్రాధాన్య ప్రాజెక్టులపై ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు, భూసేకరణ అధికారులు శుక్రవారం జల సౌధలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఇంజినీర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. పనులు ముందుకు సాగాలంటే ఆర్‌అండ్‌ఆర్ నిధులను చెల్లించాలని తేల్చిచెప్పినట్టు తెలుస్తున్నది. ప్రాధాన్య ప్రాజెక్టులకు దాదాపు 5వేల ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉంటుందని ప్రభుత్వం చెప్తున్నది.

కృష్ణా నీటిని అక్రమంగా తరలిస్తున్నా పట్టదా?

**తెలంగాణను ఎడారిలా మార్చేందుకు కాంగ